ఘనంగా తెలుగు సంవత్సరాది వేడుకలు

- ఊరువాడ సంబరాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- బోనాలతో అమ్మవారికి నైవేద్యాలు
- రంగులు చల్లుకుంటూ యువత కేరింతలు
- ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు


పాణ్యంలో చెక్క భజనను తిలకిస్తున్న ప్రజలు


పూజలందుకుంటున్న భూపనపాడు మారెమ్మ దేవి


నెరవాడలో తేరును లాగుతున్న ఎద్దు

పాణ్యం: నియోజకవర్గ వ్యాప్తంగా తెలుగు సంవత్సరాది వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీ విశ్వవసు నామసంవత్సరాన్ని పురస్కరించుకొని ఆయా గ్రామాల్లో సంబరాలు అంబరాన్ని అంటాయి. గ్రామాల్లో వెలసిన అమ్మవార్లకు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆయాలను ప్రత్యేకంగా అలంకరించడమే కాక దిగుబడులను ఆలయాలకు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఇక మహిళలు నెద్ద ఎత్తున బొనాలు ఎత్తి మొక్కులు తీర్చుకున్నారు. ఉపవాసాలతో అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు.ఉగాది పర్వదినం రోజున షడ్రుచుల ఉగాది పచ్చడిని అందరికీ పంచిపెట్టారు.

➤మండల కేంద్రమైన పాణ్యంలోని సుంకులాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. పిండి వంటలు తయారు చేసి నైవేద్యాలను సమర్పించారు. యువకులు ఒకరిపై ఒక రు రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. భక్తుల వినోదానికి చెక్కభజన ఏర్పాటు చేశారు.

➤పాణ్యంలోని చెంచుకాలనీలో వెలసిన సుంకలాపరమేశ్వరి ఆలయానికి గిరిజన మహిళలు అమ్మవారికి బొనాలు ఎత్తారు. చెంచు యవకులు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

➤ భూపనపాడు గ్రామంలో పెద్ద ఎత్తున ప్రజలు బొనాలు సమర్పించారు. వేలాది ప్రజలు మారెమ్మ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో రైతులు పండించిన పంటలను సమర్పించారు. కొత్త ధాన్యంతో అమ్మవారికి నైవేద్యం తయారు చేసి సమర్పించారు.

➤నెరవాడ గ్రామంలో పుట్టాలమ్మ ఆలయానికి ప్రజలు తేరును తయారు చేసుకొని బోనాలు తీసుకెళ్లారు. అనంతరం ఉగాది సందర్భంగా తేరును ఎడ్ల సహాయంతో లాగించారు.

➤ పాణ్యంలోని ఆంజినేయస్వామి ఆలయంలో పంచాగాన్ని వేదపండితులు శ్రీ సుబ్బశాస్త్రీ చదివి వినిపించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు.




పాణ్యం చెంచుకాలనీలో అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు, పాణ్యంలో రంగులు చల్లుకుంటున్న యువకులు, పంచాగం చదువుతున్న సుబ్బశాస్త్రి

ఊరూరా ఉగాది సంబరాలు

గడివేముల: మండల కేంద్రంలో వెలసిన మూల పెద్దమ్మ అమ్మవారిని మండల ప్రజలతో పాటు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి ఉదయం నుంచి రాత్రి వరకు ఆకుపూజలు నిర్వహించారు. అలాగే బిలకలగూడూరులోని బాలాజీ దేవాలయం, శ్రీదుర్గా భోగేశ్వరాలయం, కొరటమద్దిలోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. గ్రామాల్లోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం గడివేములలోని చెన్నకేశవస్వామి ఆలయం వద్ద పండితులు, గడిగరేవుల గ్రామంలోని శివాలయం వద్ద భోగేశ్వరాలయం ప్రధానార్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ పంచాంగ శ్రవణం చేశారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు ఆనందంగా ఉంటారన్నారు. .గడిగరేవుల గ్రామంలో ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భోగేశ్వరాలయం ఈఓ రామానుజన్, గ్రామ పెద్దలు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. రైతులు కాడెద్దులతో పొలాలకు వెళ్లి పూజలు నిర్వహించి, పొలం పనులను ప్రారంభించారు.


గడిగరేవులలో పంచాంగ శ్రవణం చేస్తున్న పండితులు


గడివేములలో ఉగాది సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు ఎద్దుల బండిని అలంకరించుకుని వెళ్తున్న రైతన్నలు

రంజాన్ శుభాకాంక్షలు

కల్లూరు: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ముస్లిం సోదరులందరికీ వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి రంజాన్ (ఈద్ ముబారక్) శుభాకాంక్షలు తెలిపారు. దాతృత్వానికి ప్రతీక రంజాన్ అన్నారు. అందరూ సుఖ సంతోషలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

వసతి గృహంలో షడ్రుచుల భోజనం


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న వసతి గృహ సంక్షేమాధికారి బెన్నమ్మ

కర్నూలు(అర్బన్): విశ్వావసు తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను నగరంలోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల నంబర్ -1 బాలికల వసతి గృహంలో ఘనంగా జరుపుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు ఈ వసతి గృహంలో ఇంటర్ నుంచి డిగ్రీ, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చేస్తూ వసతి పొందుతున్నారు. వసతి గృహంలో విధులు నిర్వహిస్తున్న సంక్షేమాధికారిణి బి.బెన్నమ్మ మెనూ పాటించడంలోనూ, కుల మతాలకు అతీతంగా పండుగలకు ఇళ్లకు వెళ్లలేని విద్యార్థినులకు అంతకుమించిన షడ్రుచుల భోజనాలను అందించడంలోనూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా హాస్టల్‌లో దాదాపు 12 రకాల వంటకాలను తయారుచేసి విద్యార్థినులకు వడ్డించారు. ఉగాది పచ్చడి, భక్ష్యాలు, అన్నం, సాంబారు, వంకాయ కూర, చిత్రాన్నం, కారం చుట్టలు, పల్లీల చట్నీ, గారెలు, నూనెలో వేయించిన మిరపకాయలు, కర్డ్‌రైస్, అరటి పండ్లను వడ్డించి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. హాస్టల్‌లోని వంట మనుషులతో కలిసి స్వతహాగా వంటకాలను తయారు చేయడంలో పాలుపంచుకోవడం విశేషం. అలాగే హాస్టల్ పరిసరాలను శుభ్రపరిచి కళ్లాపి చల్లి, రంగవల్లులను వేసి చూపరులను ఆకట్టుకునేలా హాస్టల్‌ను అందంగా అలంకరించారు.

క్లుప్తంగా

చౌడేశ్వరీదేవి సన్నిధిలో కాటసాని దంపతులు


ఆలయంలో పూజలు చేస్తున్న కాటసాని దంపతులు

కల్లూరు : కల్లూరులో వెలసిన చౌడేశ్వరీదేవిని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ దంపతులు దర్శించుకున్నారు. ఆదివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా చౌడేశ్వరీ మాతదేవి ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలందరికీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఇంటిల్లిపాది పండుగను ఘనంగా పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నరసింహులు, నాయకులు రంగప్ప, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై నిజాలు నిగ్గుతేల్చాలి


గూడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘాలు

కోడుమూరు రూరల్: పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనుమానాలను నివృత్తి చేయాలంటూ ఆదివారం గూడూరు పట్టణంలో సెంటినరీ బాప్టిస్ట్ సంఘం, క్రైస్తవ సంఘాల సభ్యులు ఐక్యత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు యోహాన్, సుభాకర్ మాట్లాడుతూ.. పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రజలకు అనుమానాలున్నాయని, పోలీస్ యంత్రాంగం త్వరగా కేసును ఛేదించి వాటిని నివృత్తి చేయాలన్నారు. గూడూరు మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, సంఘ కాపర్లు, ఆదామ్, బోయాజ్, మధు, షారోన్ కుమార్, రవి, దానమయ్య, సంఘ పెద్దలు, క్రైస్తవులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సెక్యూరిటీ గార్డ్ మృతి


మృతి చెందిన వెంటేశ్వర్లు

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ కంపెనీలో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్న సంపంగి వెంకటేశ్వర్లు (61)గుండె పోటుతో మృతి చెందినట్లు ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఆదివారం తలిపారు. బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన సంపంగి వెంకటేశ్వర్లు సోలార్‌లోని కూలర్ అనే కంపెనీలో సెక్యూరిటీగా పని చేస్తున్నాడు. ఆదివారం విధుల్లో ఉండగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాలకు తరలించారు. మృతుడికి భార్య సులోచనమ్మ, కుమారుడు సంతానం ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇఫ్తార్ విందు


ముస్లింలతో కలిసి దువా చేస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు (రూరల్): రంజాన్ మాసం పురస్కరించుకుని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తన సొంత గ్రామం పంచలింగాలలో, అలాగే నగరంలోని పాత ఈద్గాలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఎంపీ ఉపవాస దీక్ష ప్రత్యేక ప్రార్థనలు చేసి, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మత సామరస్యానికి ప్రతీక కర్నూలు జిల్లా అని, ఇక్కడ అన్ని కులాల వారు అన్ని పండుగలను కలిసిమెలిసి జరుపుకుంటారని అన్నారు. టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కర్నూలు(రూరల్): కర్నూలు పార్లమెంటు పరిధిలో వివిధ మండలాలకు చెందిన నలుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.8,40,332 చెక్కులను ఆదివారం ఎంపీ బస్తిపాటి నాగరాజు తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదన్నారు. లబ్ధిదారులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీరామ కథా రసవాహిని ప్రారంభం

కర్నూలు కల్చరల్: భగవాన్ సత్య సాయిబాబా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నెహ్రూనగర్‌లోని సాయి మందిరంలో వారం రోజుల పాటు నిర్వహించే శ్రీరామ కథా వాహిని కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ముందుగా విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను నిర్వహించారు. పండితులు కేశవయ్య పంచాంగ శ్రవణం చేశారు. సాయి సేవా ట్రస్ట్ సభ్యులు, అధ్యాపకులు సూర్యనారాయణ శ్రీరామ కథా రస వాహినిని పరిచయం చేశారు. సభ్యులు సందీప్, అశోక్, పట్టాభి, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సరంలో సమృద్ధిగా వర్షాలు

- ఎర్రధాన్యానికి అధిక బలం.. పత్తికి అర్ధబలం


హుసేనాపురంలో పంచాంగం వినిపిస్తున్న పండితులు మనోహర్‌శర్మ

ఓర్వకల్లు : విశ్వవసునామ సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు ఆనందంగా వుంటారని వేదపండితులు తెలిపారు. ఆదివారం మండలంలోని ఓర్వకల్లు, హుసేనాపురం, శకునాల, నన్నూరు, ఉయ్యాలవాడ తదితర గ్రామాలలో విశ్వావిసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు ఉదయాన్నే స్నానమాచరించి నూతన వస్త్రాలు ధరించి, గ్రామ దేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం హుసేనాపురం, ఓర్వకల్లు గ్రామాలలో వేద పండితులు జంధ్యాల మనోహర్‌శర్మ, విష్ణుశర్మలు పంచాగ శ్రవణం నిర్వహించారు. గ్రహాల ప్రవేశాల దృష్ట్యా భవిష్యవాణి చదివి వినిపించారు. రేవతి, అశ్వని, భరణి, మృగశిర కార్తెలలో వర్షాలు అధికంగా కురిసి, పంటలకు అనుకూలంగా వుంటాయని చెప్పారు. ఈ ఏడాది ఎర్రటి ధాన్యానికి అధిక బలం , తెల్ల పంటలకు అర్ధబలం వుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఈఓలు మద్దిలేటి, చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వల్లెలాంబదేవి రథోత్సవం


కొటారుమిట్టలో పూజలందుకుంటున్న రంగస్వామి

అశేషజనవాహిని మధ్య సాగుతున్న వల్లెలాంబదేవి రథోత్సవం

కోడుమూరు రూరల్: కోడుమూరులో హంద్రీనది ఒడ్డున వెలసిన వల్లెలాంబదేవి రథోత్సవం ఆదివారం సాయంత్రం అశేష జనవాహిని మధ్య అంగరంగ వైభవంగా సాగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు పట్టణ ప్రజలేగాక, జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వల్లెలాంబా.. చల్లగా చూడమ్మా... అంటూ భక్తుల నామస్మరణ మధ్య అమ్మవారి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. అంతకుముందు భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్, దాత ఎద్దుల మహేశ్వరరెడ్డి స్వగృహం నుంచి అమ్మవారికి మొదటి నైవేద్యాన్ని మేళతాళాలతో ఆలయ కమిటీ చైర్మన్, జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఊరేగింపుగా తీసుకెళ్లి వల్లెలాంబదేవికి సమర్పించారు. అనంతరం దేవి రథోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని చిన్నబోయవీధి కాలనీవాసులు బోనపు కుండలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోడుమూరు ఎస్‌ఐ శ్రీనివాసులు సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సి.బెళగల్: ఉగాది పండుగ సందర్భంగా సి.బెళగల్‌లో రంగస్వామి ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. అనంతరం స్వామివారి ఆలయంలో పూజారులు వెంకటేశ్వర్లు, పురోహితులు నరసింహరావు గ్రామస్తులకు పంచాంగ శ్రవణం నిర్వహించారు. అలాగే గ్రామంలోని చింతలముని రంగడు, నల్లారెడ్డి స్వాముల ఆలయాల్లో భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. గ్రామ పెద్దలు, హైకోర్టు న్యాయమూర్తి సీబీ రామ్మోహన్‌రెడ్డి, గోవిందరెడ్డి, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముడుమాల గ్రామంలో శ్రీలక్ష్మి వేంకటేశ్వర్ల ఉత్సవ విగ్రహాలను ప్రభపై ఘనంగా ఊరేగించారు. గ్రామస్తులు ఎద్దుల బండ్లు, ఆటోలు, ట్రాక్టర్లలో ఫలహారాలను గ్రామ చివర పొలాల్లో కొలువైన ఆంజనేయ స్వామి ఆలయానికి తీసుకెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.


అమ్మవారికి మొదటి నైవేద్యాన్ని తీసుకెళుతున్న ఎద్దుల మహేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు


అమ్మవారికి పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్


సి.బెళగల్‌లో రంగస్వామికి పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

ఉద్యోగుల సామాజిక సేవ అభినందనీయం

కర్నూలు (టౌన్): నగరపాలక ఉద్యోగులు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందించదగ్గ విషయమని కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. ఆదివారం స్థానిక 17వ శానిటేషన్ డివిజన్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో 42 మంది పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను బహుకరించారు. అలాగే చలివేంద్రం ప్రారంభించి ఆవరణలో మొక్కలు నాటారు.

వాహన డ్రైవర్ల సంఘం సలహాదారు నియామకం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం రాష్ట్ర సలహాదారులుగా కర్నూలుకు చెందిన అబ్దుల్ హమీద్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాస రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన జిల్లా ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం కార్యదర్శిగా, అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేశారని, ఎంతో అనుభవం కలిగిన సీనియర్ నాయకుడిగా గుర్తించి రాష్ట్ర సంఘం సలహాదారులుగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. తనను రాష్ట్ర సంఘం సలహాదారులుగా నియమించడం పట్ల సర్దార్ అబ్దుల్ హమీద్ హర్షం ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం అభ్యున్నతికి, మరింత బలోపేతం చేసేందుకు అన్ని విధాలా సహకరిస్తానని పేర్కొన్నారు. ఈయన కర్నూలు ఆర్‌డబ్ల్యూఎస్‌లో ప్రభుత్వ వాహన డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.


కల్లూరు చౌడేశ్వరీ దేవి ఆలయం చుట్టూ బురదలో ఎడ్లబండితో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వైభవంగా ఉగాది ఉత్సవాలు

కల్లూరు: విశ్వావసు నామ సంవత్సర ఉగాది తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం దేవాలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. కొలిచిన వారి కొంగు బంగారంగా వెలుగొందుతున్న కల్లూరు చౌడేశ్వరీ మాత ఆలయంలో జరిగే ఉగాది ఉత్సవాలకు జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి, తెలంగాణ రాష్ట్రం నుంచి భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, గౌరు వెంకటరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా సాయంత్రం ఆలయం చుట్టూ చిన్నారులు, యువత బురదలో కేరింతలతో సంబరాలు చేసుకున్నారు. రైతులు ఎద్దులను ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.


కల్లూరు చౌడేశ్వరీ దేవిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తజనం


ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వినోద పరికరాలు

నేటి పీజీఆర్ఎస్ రద్దు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రంజాన్ పండుగను పురస్కరించుకొని రద్దు చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు గమనించాలని కోరారు. వచ్చే సోమవారం నుంచి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని వెల్లడించారు.

నేడు ఈద్ ఉల్ ఫిత్ర్

- ఆదివారం ఇఫ్తార్‌తో ముగిసిన ఉపవాసాలు
- రంజాన్ పండగకు పూర్తయిన ఏర్పాట్లు
- సామూహిక ప్రార్థనలకు ఈద్గా, మసీదులు సిద్ధం

గడివేముల: పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. షవ్వాల్ నెల ప్రారంభ సూచికగా ఆదివారం సాయంత్రం చంద్రవంక దర్శనంతో ముస్లింలు ఈద్ నమాజ్‌కు సిద్ధమయ్యారు. సోమవారం ఈద్ ఉల్ ఫిత్ర్ పండగ చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. నెల రోజుల పాటు కఠోర రోజాలు(ఉపవాసాలు) పాటిస్తూ, నమాజులు, తరావీ నమాజ్, సహర్, ఇఫ్తార్, ఖురాన్ పఠనం, దాన ధర్మాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో గడిపారు. ఉష్ణోగ్రతలు 38-40 డిగ్రీలు దాటినా సడలని నిష్ఠతో దీక్ష కొనసాగించారు.

ఈద్ నమాజ్‌కు సిద్ధం

ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ కోసం మండలంలోని గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈద్గాలతో పాటు మసీదుల్లో ప్రార్థనలకు అన్ని సౌకర్యాలు కల్పించారు. పండగ రోజు ముస్లింలు ఈద్గాలకు వెళ్లి ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ చేస్తారు. నెల రోజుల తమ ప్రార్థనలు ఫలించాలని, సర్వ మానవాళి సంతోషంగా ఉండాలని కోరుతూ దువా చేస్తారు.


విద్యుద్దీపాలతో కాంతులీనుతున్న గడివేములలో మదీనా మసీదు


సత్తార్ మసీదులో చిన్నారులను సన్మానిస్తున్న దృశ్యం

ఉపవాసాలు పూర్తి చేసిన బాలురకు సత్కారం

మండల కేంద్రమైన గడివేములలో నెల రోజుల ఉపవాసములు పూర్తిచేసిన నలుగురు బాలురను ఆదివారం సత్తార్ మసీదులో హజరత్ ఇమ్రాన్ అభినందించారు. 10 నుంచి 12 సంవత్సరాలు గల నలుగురు చిన్నారులు కఠోర ఉపవాస దీక్షలు చేసి ప్రతిరోజు ఐదు పూటల ప్రార్థనలు చేశారు. వారిని ఘనంగా సన్మానించారు.

సత్ప్రవర్తనకు మార్గదర్శకం



రంజాన్ మాసంలో అనుసరించిన నియమ నిష్టలు, ప్రత్యేక ప్రార్థనలు మానవాళి సత్ప్రవర్తనకు మార్గదర్శకంగా దోహదపడతాయి. దివ్య ఖురాన్ పఠనం వల్ల ప్రజలందరూ ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలతో జీవిస్తారు. కుల, మత, వర్గ రహితంగా సమాజంలో స్నేహ పూర్వక వాతావరణం ఏర్పడుతుంది.

– ఖాజీ మౌలానా షేక్ అబ్దుల్ రెహమాన్ రషాది, ప్రభుత్వ ఖాజీ, గడివేముల

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కర్నూలు: ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయా స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లు, నేర చరిత్ర గలవారు, చెడు నడత కలిగిన వ్యక్తులను స్టేషన్లకు రప్పించి నేర ప్రవృత్తికి స్వస్తి పలికి గౌరవప్రదమైన జీవితం గడపాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, పోలీస్ ఆదేశాలను లెక్క చేయకుండా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పలుమార్లు కౌన్సెలింగ్‌కు హాజరు కాని రౌడీషీటర్ల వివరాలతో పాటు జీవనోపాధికి వారు చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీస్ అధికారి

ఉద్యోగుల సామాజిక సేవ అభినందనీయం

కర్నూలు (టౌన్): నగరపాలక ఉద్యోగులు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందించదగ్గ విషయమని కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. ఆదివారం స్థానిక 17వ శానిటేషన్ డివిజన్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో 42 మంది పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను బహుకరించారు. అలాగే చలివేంద్రం ప్రారంభించి ఆవరణలో మొక్కలు నాటారు.